క్లుప్తంగా

22న హనుమత్ జయంతి

సామర్లకోట: ఈనెల 22వ తేదీన స్థానిక అతిపురాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమత్ జయంతి సందర్భంగా ఆలయంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, సహస్ర నామ పూజలు నిర్వహించనున్నారు. భక్తులు పాల్గొన్ని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఏఎస్పీ



పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న దేవానందరావు కుటుంబ సభ్యులు

సామర్లకోట: పెద్దాపురం పట్టణంలో ఉన్న మరిడమ్మ అమ్మవారిని కాకినాడ మూడో బెటాలియన్ అడిషనల్ ఎస్పీ దేవానందరావు కుటుంబ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం వారిని ఆలయ వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సిబ్బంది వారికి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం



నాగులపల్లిలో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: నాగులపల్లిలో ఉన్న ఆటో స్టాండ్ వద్ద సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ చలివేంద్రాన్ని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గురాల అప్పారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రధాన కూడళ్లలో చలివేద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమాంలో సీపీఎం నాయకులు నాగేశ్వరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో ప్రతిభ చూపిన విద్యార్థులు

సామర్లకోట: పెద్దాపురం పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 10, 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు మంగళవారం విడుదల అయిన సీబీఎస్ఈ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ బి.సీతలక్ష్మి మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సర సీబీఎస్ఈ ఫలితాల్లో పదో తరగతి విద్యార్థులు కోరడ సత్యానందం 500 మార్కులకు 487 మార్కులతో 97.4 శాతం సాధించి ప్రథమ స్థానం పొందారని తెలిపారు. జన్యం సాయి పవన్ 473 మార్కులతో ద్వితీయ స్థానం, కొల్లు మహిత 473 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారన్నారు. అదే విధంగా 12వ తరగతి విద్యార్థులు పాబోలు నందగోపాల్ ప్రథమ, కారెడ్ల ఎస్ఎస్ఎస్ ప్రసాద్ ద్వితీయ, ఎల్లమెల్లి ప్రారం ప్రియదర్శి కౌశిక్ తృతయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ తెలిపారు.

తాగునీటి సరఫరాకు నేడు అంతరాయం



సత్తెమ్మతల్లి ఆలయం వద్ద మరమ్మతులకు గురైన ప్రధాన పైపులైను

కొత్తపల్లి: మండల పరిధిలో ఉన్న పలు గ్రామాలకు బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వెంకట రమణ తెలిపారు. పిఠాపురం ఉప్పాడ రోడ్డులోని వాకతిప్ప శివారు కొమరగిరి జంక్షను వద్ద సత్తెమ్మ తల్లి ఆలయ సమీపంలో ప్రధాన తాగునీటి పైపులైను మరమ్మతులు గురైంది. దీంతో వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, అమీనాబాదు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. ప్రజలు సహకరించాలన్నారు. గురువారం యథావిధిగా తాగునీరు అందిస్తామన్నారు.

డీప్ ఫ్రీజర్ సేవలు ప్రారంభం

కాకినాడ క్రైం: సుషేణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న మదర్ మిల్క్ బ్యాంక్‌లో నూతనంగా డీప్ ఫ్రీజర్ ఏర్పాటు చేశారు. తల్లిపాల భద్రత కోసం వినియోగించనున్న ఈ డీప్ ఫ్రీజర్‌ను మంగళవారం జీజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, జీజీహెచ్‌లో మదర్ మిల్క్ బ్యాంక్ సేవలు అసామాన్యవని కొనియాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన డీప్ ఫ్రీజర్ సామర్థ్యం 450 లీటర్లు కాగా, ఇందులో ఆరు నెలల వరకు తల్లి పాలను పాడవ్వకుండా భద్రపర్చవచ్చన్నారు. అలా భద్రపరిచిన పాలను పాశ్చరైజ్ చేసి శిశువుకి పట్టిస్తారని తెలిపారు. మిల్క్ బ్యాంకులోని పారిశుద్ధ్య, రికార్డుల నిర్వహణపై డాక్టర్ విఠల్ సంతృప్తి వ్యక్తం చేస్తూ బృందాన్ని అభినందించారు.

విజ్ఞానం.. వినోదం

- గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ
- విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేలా తర్ఫీదు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ...
- కొనసాగనున్న తరగతులు



ఉప్పాడలోని గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపల్లి: వేసవి సెలవుల్లో చిన్నారులకు విజ్ఞానం, వినోదం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న గ్రంథాలయాల్లో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి తరగతులు నిర్వహించి పలు అంశాలపై శిక్షణ ఇస్తోంది. కాకినాడ జిల్లాలోని ఉన్న 40 గ్రంథాలయాల్లో మే 28న ప్రారంభమైన వేసవి తరగతులకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కాకినాడ జిల్లాలోని 40 గ్రంథాలయాల్లో సుమరు 400 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నరు. ఈ నెల 6 వరకు వివిధ అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు.

సజనాత్మకత వెలికి తీసేలా.

చిన్నారుల్లోని సజనాత్మకత వెలికి తీసేలా గ్రంథాలయ శాఖ ప్రత్యేక వేసవి శిబిరాలను నిర్వహిస్తోంది. పుస్తక పఠనం వైపు మళ్లించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యార్థులు గ్రంథాలయల్లోనే ఉంటూ విజ్ఞానం, వినోదం, సాహిత్యం, చిత్రలేఖనం, సంగీతం, భావ వ్యక్తీకరణ, ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. ఫ్యాకల్టీతో వివిధ అంశాలపై విద్యాబోధన అందిస్తున్నారు. పుస్తక పఠనం, కథలు, చదరంగంతోపాటు వినోదం, విజ్ఞానం కలబోతగా పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఆకట్టుకునేలా కథలు చెప్పడం, నీతి కథలను మానవీయం, ప్రవర్తన, భావ వ్యక్తీకరణ వంటి అంశాలపై శిక్షకులతో తర్ఫీదు ఇస్తున్నారు. దాతల సహకారంతో విరామ సమయంలో విద్యార్థులకు బిస్కెట్లు, మజ్జిగను అందిస్తున్నారు. ఆసక్తి కున్న 5ఏళ్ల నుంచి 16ఏళ్ల వయసు చిన్నారులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు.

రోజువారీ ప్రణాళిక ఇలా

ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకూ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు చదివించడం. కథలు చెప్పడం, స్పోకింగ్ ఇంగ్లిష్, హిందీ, డ్రాయింగ్, పెయింటింగ్, సంగీతం, యోగా, ధ్యానం నేర్పించడం.

పిల్లలను ప్రోత్సహించండి



విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచేందుకు, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలు ఎంతో ఉపయోగకరం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 100 గ్రంథాలయాల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నాం. సుమారుగా వెయ్యి మంది విద్యార్థులు శిక్షణకు వస్తున్నారు. కాకినాడ జిల్లో 40 గ్రంథాయాల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నాం. సుమారు 400 మంది శిక్షణకు వస్తున్నారు. నిపుణులైన శిక్షకులతో పిల్లలకు తర్ఫీదు ఇస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి గ్రంథాలయాలకు పంపించాలి.

– వి.సాయిప్రసాద్, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

పిల్లల్లో ఆసక్తి



ఈ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరానికి వచ్చేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం వారి సంఖ్య రెట్టింపు అయ్యింది. సుమరు 20 మంది విద్యార్థులు వస్తున్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు కూడా అందిస్తాం. ప్రతి ఏడాది గ్రంథాలయాల్లో నిర్వహించే శిక్షణ శిబిరాలకు మంచి ఆదరణ లభిస్తుంది.

– టి.నళినీ ప్రియ, ఉప్పాద గ్రంథాలయ అధికారి

ఎంతో ఉపయోగం



గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ఈ శిక్షణ వలన వారిలో ఉన్న సజనాత్మకతను వెలికి వస్తుంది. విద్యార్థులు ఈ శిక్షణకు వచ్చేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరానికి పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ఆసక్తి ఉన్న విశాంత్రి ఉపాధ్యాయులు వచ్చి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

– టి.జయకృష్ణ, కొత్తపల్లి, గ్రంథాలయ అధికారి

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

పిఠాపురం: పోక్సో చట్టంపై బాలికలు అవగాహన పెంచుకోవాలని జిల్లా బాలాల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి సూచించారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ ఆదేశాల మేరకు పిఠాపురం ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి ఆధ్వర్యంలో మంగళవారం పిఠాపురం మండలం జల్లూరు, గోవింద రాజు పురం గ్రామాల్లో కిశోరీ వికాసం సమ్మర్ కాంపెయిన్ నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్న కౌన్సిలర్ దుర్గారాణి మాట్లాడుతూ షెడ్యుల్ ప్రకారం బాలల హక్కులు, బాలల లైంగిక వేధింపుల నిషేధిత చట్టం (పోక్సో) గురించి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దడానికి కిశోర వికాసాన్ని అమలు చేస్తున్నారని, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలాగే డెవలప్ చేయాలి అనే అంశాల పై అవగాహన కల్పించారు. అలాగే బాలల హక్కులు చట్టాలు వివరించారు. ఈ కార్యక్రమం మే 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో జీఎంఎస్‌కే లావణ్య అంగన్‌వాడీ సిబ్బంది పలువురు బాలికలు పాల్గొన్నారు.

ఆకులతో బొమ్మల తయారీ

ఆకట్టుకున్న చిన్నారుల శిక్షణ

సామర్లకోట: చిన్నారులు ఆకులతో బొమ్మల తయారీ ఎంతగానో ఆకట్టుకుంది. పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో జరుగుతున్న పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్(పీసీసీ) సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం శిక్షణ కొనసాగించారు. దుయం విద్యార్థులకు కరాటే, వ్యాయామం శిక్షణ తెప్పల యోగేష్, లోకేష్ నిర్వహించారు. పీసీసీ గౌరవ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసు విద్యార్థులకు ఆకులతో బొమ్మల తయారు చేయడంపై శిక్షణ నిర్వహించి వారితో బొమ్మలు తయారు చేయించారు. సమ్మర్ క్యాంపు వినోదం, విజ్ఞానం కోసం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసు తెలిపారు. విద్యార్థులలో ఉన్న నైపుణ్యం వెలికి తీయడానికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రొంగల అరుణ్, కోనరెడ్డి రవికుమార్, మణికంఠ, సాయి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



కొత్తపల్లిలో అగ్నికి ఆహుతైన గడ్డివామి

కొత్తపల్లి: స్థానిక బంగారు దొడ్డి సమీపంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన లొల్ల వీరవెంకట సత్యనారాయణ పొలంలో గడ్డివామి మంగళవారం అగ్నికి ఆహుతైంది. సుమారు 8 ఎకరాల గడ్డిని మేటుగా వేశారు. గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డి

ఉప్పాడ కోనపాపపేట బీచ్‌రోడ్డులో ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డివాము విద్యుత్ షార్ట్ కారణంగా దగ్ధమైందని పిఠాపురం అగ్రిమాపక అధికారి డి.రామకృష్ణరాజు తెలిపారు. పొన్నాడ శివారు శీలంవారి పాలెనికి చెందిన రాజాల రాజు అన్నవరం సమీపం నుంచి గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తరలిస్తుండగా కోనపాపపేట శివారు సమీపంలో విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో మంటలను గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ ట్రక్కు మంటలు వ్యాపించాయి. సమారు రూ. ఒక లక్ష నష్టం వాటిల్లినట్లు అగ్రిమాపక సిబ్బంది తెలిపారు.

పాదగయ క్షేత్రంలో సినిమా డైరెక్టర్ హను రావిపూడి



దర్శకుడు రావిపూడికి ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్

పిఠాపురం: 'సీతారామం' మూవీ డైరెక్టర్ హను రావిపూడి మంగళవారం పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకారు. ఆయన కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి దేవి, పురుహూతికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామిలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించగా ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ, అల్లంరాజు చంద్రమౌళి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పెంటపాటి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో దళారీ వ్యవస్థను రద్దు చేయాలి

మంత్రికి వినతిపత్రం అందజేసిన ఔట్‌సోర్సింగ్ జిల్లా ఛైర్మన్



మంత్రి రవికుమార్‌కు వినతి పత్రం అందజేసిన వీసం వీరనాగు

సామర్లకోట: విద్యుత్ శాఖలో ఉన్న దళారి వ్యవస్థను రద్దు చేసి ఔట్ సోర్సింగ్ కార్మికులను నేరుగా వేతనాలు ఇచ్చే విధానం అమలు చేయాలని ఉమ్మడి జిల్లా ఔట్‌సోర్సింగ్ అసోషియేషన్ ఛైర్మన్ వీసం వీరనాగు అన్నారు. మంగళవారం సామర్లకోట వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీరనాగు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళారి వ్యవస్థ కారణంగా తమ శ్రమ దోపిడీకి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 జూన్‌లో విద్యుత్ కార్మికులకు సంబంధించిన కాంట్రాక్టు పూర్తి అయిందని, జూలై నుంచి దళారీ వ్యవస్థను రద్దు చేయాల్సి ఉందని కోరారు. డిస్కం పరిధిలో చనిపోయిన కార్మికులపై ఆధారపడిన కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు.

కాంట్రాక్టు కార్మికులకు కౌన్సిల్ సంఘీభావం



పెద్దాపురంలో సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపిన వైస్ ఛైర్మన్ సాయి తదితరులు

సామర్లకోట: తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని పెద్దాపురం మున్సిపల్ ఇంజినీరింగ్‌శాఖ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకోవడంతో పెద్దాపురం మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఈ మేరకు పెద్దాపురం మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిల్ సభ్యులు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏడు నెలల క్రితం తాము సమ్మె చేయడంతో సీడీఎంఏ తమ సమస్యలను పరిష్కరిస్తామని, సమ్మెను ఉపసంహరించుకోవాలని, సమస్యలు పరిష్కరించడానికి రెండు నెలలు గడువు కొరారని కార్మికులు తెలిపారు. అయితే సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చి ఆరు నెలలు గడచినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మికులు 15 సంవత్సరాలు దాటిన వారిని పర్మినెంట్ చేయాలని, విధి నిర్వాహణలో చనిపోతే రూ.10 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్, నాన్ స్కిల్ వర్కర్లను గుర్తించి కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు అరెళ్ల రాఘవ, విజ్జిన రాజశేఖర్, తల్సికి సత్యభాస్కర్, పప్పల దుర్గారావు రఫీ, వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి



పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు



జి.రాగంపేటలో పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు

- రూ.92వేల నగదు స్వాధీనం
- ఏడుగురిపై కేసు

సామర్లకోట: పెద్దాపురం మండలం జె.తిమ్మాపురంలో పేకాట శిబిరంపై మంగళవారం తెల్లవారుజామున సీఐ విజయశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.92,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మౌనిక తెలిపారు. పేకాటాడుతున్న వారిపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రాగంపేటలో పేకాట శిబిరంపై దాడి

జి.రాగంపేట పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. ఈ మేరకు పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.72,560 స్వాధీనం చేసుకున్న ఎస్సై మౌనిక తెలిపారు. కేసు నమోదు చేసి ఆమె దర్యాప్తు చేస్తున్నారు.

లో ఓల్టేజీ సమస్యకు చెక్

సామర్లకోట: అచ్చంపేట గ్రామంలో నిర్మిస్తున్న 33/11కేవీ నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌తో అనేక గ్రామాల్లోని లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఏపీఈపీడీసీ ఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ప్రభాకర్ తెలిపారు. అచ్చంపేటలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈఈ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్మాణంతో గొంచాల, నవర, చంద్రంపాలెం, పవర, బ్రహ్మానందపురం, ఉండూరు, పి.వేమవరం, కాపవరం, అచ్చంపేట, పనసపాడు, కొప్పవరం, గ్రామాలకు తిమ్మాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అవుతుంది. ఆయా గ్రామాల ప్రజలు తరచూ లోఓల్టేజ్ సమస్యను ఎదుర్కోవడంతో నూతన సబ్ స్టేషన్ నిర్మిస్తున్నారు. దీంతో ఆ ఎనిమిది గ్రామలకు 24 గంటల పాటు నిరంతర విద్యుత్ అందజేయనున్నట్టు సిబ్బంది చెప్పారు. 11 గ్రామాల్లోని 10,958 మంది గృహ వినియోగదారులకు, 81 పరిశ్రమలకు లబ్ధి చేరుకూరుతుందని తెలిపారు.

ప్రతి ప్రభుత్వ కార్యాలయానికీ సొంత భవనం

- రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్
- తహసీల్దార్, ఐసీడీఎస్ కార్యాలయాల ప్రారంభం



సామర్లకోటలో తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి అనగాని సత్యప్రసాద్

సామర్లకోట: రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి సొంత భవనం ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద నూతనంగా నిర్మాణం చేసిన తహసీల్దార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలను రెవెన్యూ శాఖమంత్రి సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. రూ.64లక్షలతో తహసీల్దార్ కార్యాలయం, రూ.39 లక్షలతో ఐసీడీఎస్ కార్యాలయం నిర్మాణం చేశారు. ఆయా ప్రాంతాల్లో గృహ నిర్మాణాలతో పాటు పరిశ్రమలు పెరగడం వల్ల విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మాణం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండల పరిధిలో అచ్చంపేట గ్రామంలో రూ.మూడు కోట్లతో నిర్మాణం చేసే సబ్ స్టేషన్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షత వహిస్తూ ఏడాదిలో రూ.100 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా ఛైర్మన్ తుమ్మల బాబు, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉషా, వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజాసూరి బాబురాజు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ వైస్‌ఛైర్మన్ యార్లగడ్డ చిన్ని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఒక్క మార్కు కూడా కీలకమే..

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరావు

కాకినాడ సిటీ: డీఎస్సీ పరీక్షల్లో ఒక్క మార్కు కూడా కీలకమేనని పోటీ పరీక్షల కోచింగ్ నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. డీఎస్సీ పరీక్షలకు అభ్యర్థులు మానసిక ధైర్యంతో సంసిద్ధులు కావాలని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు మంగళవారం సాయంత్రం సూర్యకళా మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ జిల్లా సహాధ్యక్షుడు వీవీ రమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, 2014, 2018 డీఎస్సీ ప్రశ్నపత్రాలను ఒకసారి ఆన్సర్ చేయాలని సూచించారు. డీఎస్సీ అభ్యర్థుల ప్రస్తుత గరిష్ట వయో పరిమితిని 44 నుంచి 47 ఏళ్లకు మార్చాలని కోరారు. డీఎస్సీ పరీక్ష ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో జరపాలన్నారు. ఇంకా అకడమిక్ అంశాలపై అవగాహన కల్పించారు. చదివినవి రివిజన్ చేసుకోవాలని, టెక్స్ట్ పుస్తకాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అత్యంత జాగ్రత్తగా ఆన్సర్ చేయాలన్నారు. కరెంట్ అఫైర్స్ గత 8 నెలల నుంచి జరిగినవి చదవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్పాట్ విశ్లేషణ చేసుకోవాలని, సబ్జెక్టులో బలహీనత గుర్తించుకుని, దాని నుంచి బయటపడే మార్గం అన్వేషించాలన్నారు. ప్రిపరేషన్ సమయంలో ఒత్తిడికి గురి కాకుండా. గత డీఎస్సీ పేపర్లు స్టడీ చేయాలన్నారు. ప్రశ్న స్వభావం గుర్తించి ప్రిపరేషన్ కావాలన్నారు. జనరల్ నాలెడ్జ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కాన్సెప్ట్‌ను సృజనాత్మకతతో చదవాలని చెప్పారు. మెథడాలజీకి సంబంధించి తెలుగు అకాడమీ ముద్రించిన పుస్తకాలు చదవడం ఉత్తమమని, గైడ్స్ కంటే టెక్స్‌బుక్స్ చదివితే ఉత్తమ ఫలితాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు రాసిన సమకాలీన వ్యాసాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టీజీవీజీఆర్ రవిచక్రవర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి టి.ప్రభాకరవర్మ, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవీవీ సాయిరామ్, జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్, ఇతర ప్రతినిధులు కేవీవీ నాగేశ్వరరావు, పీఎన్‌వీ గణేష్, సీహెచ్‌వీ రమణ, తోట సీతారామయ్య, టి.రామలక్ష్మి, డి.కనకదుర్గాదేవి, నక్కా గోవిందరాజులు, ఐ.ప్రసాదరావు, సీఐటీయూ నాయకుడు పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

కరప: జీవితంలో ఒంటరితనాన్ని తాళలేని ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన కరపలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, కరప గ్రామానికి చెందిన ఇల్ల దుర్గారావు(60)ను కొన్నాళ్ల క్రితం భార్య వదిలివేసింది. దీంతో ఒక్కడే జీవనం సాగిస్తున్నాడు. గతేడాది కుమారుడు మరణించడంతో మరింతగా కుంగిపోయాడు. భార్య కాపురానికి రాకపోవడం, మరోవైపు ఆదుకోవాల్సిన కుమారుడి మరణంతో అతడికి జీవితంపై విరక్తి కలిగింది. ఈ క్రమంలో దుర్గారావు మంగళవారం తునిలో ఉంటున్న కుమార్తెకు చనిపోతున్నట్టు ఫోన్ చేశాడు. తర్వాత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో 14 మంది నిందితులను హాజరుపర్చారు. వీరిలో ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు, 8 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.